

నిబంధన ప్రకారమే టెండర్లు

బాసర, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : బాసర రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు భోజనం అందించే మెస్ టెండర్లు నిబంధనల ప్రకారమే నిర్వహించనట్లు మంగళవారం యూనివర్సిటీ పరిపాలన అధికారి మురళీదర్శన్ స్పష్టం చేశారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాలకు స్పందించారు. 9వేల మంది విద్యార్థులు చదువుకుంటున్న యూనివర్సిటీలో మెస్ టెండర్లు ఆన్‌లైన్ ద్వారా పారదర్శకంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. మెస్ టెండర్లపై వస్తున్న ఆరోపణలు అనుమానాలు అవాస్తవమని అన్నారు. ఈమేరకు యూనివర్సిటీ అధికారులు, కలెక్టర్ అభిలాష అభినవ్‌కు నివేదించారు.



అవార్డు అందుకుంటున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ జిల్లాకు అవార్డు

జల సంచాయ్ - జన్ భాగీదారి అవార్డు

- న్యూ ఢిల్లీలో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ చేతుల మీదుగా అవార్డు స్వీకరించిన కలెక్టర్ అభిలాష అభినవ్
- జాతీయ స్థాయిలో విరాజిల్లిన నిర్మల్ జిల్లా ఖ్యాతి
- అవార్డు లభించడంపై సంతోషం వ్యక్తం చేసిన జిల్లా పాలనాధికారి

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మరోసారి జాతీయ వేదికపై నిర్మల్ జిల్లా ఖ్యాతి విరాజిల్లింది. నిర్మల్ జిల్లాకు జల అవార్డుల్లో భాగంగా, జల సంచాయ్ - జన్ భాగీదారి అవార్డు లభించింది. మంగళవారం కేంద్ర జల శక్తి మంత్రి సీఆర్ పాటిల్ చేతుల మీదుగా అవార్డును జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్వీకరించారు. ఈ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ వేదికైంది. అవార్డు లభించడంపై జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్పందిస్తూ, జిల్లాకు జల సంచాయ్ - జన్ భాగీదారి అవార్డు లభించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అధికారులు సమిష్టి కృషి, ప్రజల విలువైన భాగస్వామ్యంతో ఈఘనత సాధ్యమైందని స్పష్టం చేశారు. అవార్డు రావడానికి కృషి చేసిన అధికారులకు, సహకారాన్ని అందించిన ప్రజలందరికీ ఈ సందర్భంగా కలెక్టర్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ అవార్డు వీరందరికీ చెందుతుందని తెలిపారు. అవార్డు స్వీకరించిన వారిలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌తో పాటు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి విజయలక్ష్మి ఉన్నారు.నిర్మల్ జిల్లాకు జలసంచాయ్ - జన్ భాగీదారి అవార్డు లభించడంపై అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్‌కుమార్ సంతోషం వ్యక్తం చేశారు. అవార్డు స్వీకరించిన కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు జిల్లాకు ప్రతిష్ఠాత్మకమైన అవార్డు రావడంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ఖైంసాలో కేటీఆర్ సమావేశానికి హాజరైన రైతులు, జనాలు

ప్రభుత్వాల తీరుతో గుండెకోత

ఖైంసా సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

- సీసీఐ కొర్రీలు, తేమశాతం నిబంధనలతో సోయా రైతులకు అవస్థలు
- రానున్నది కేసీఆర్ ప్రభుత్వం... రైతన్నలకు వెన్నుదన్నుగా నిలుస్తాం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై మండిపాటు
- ఖైంసా పర్యటనలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

ఖైంసా, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న తప్పుడు విధానాల తీరుతోనే దిగుబడుల విక్రయ ప్రక్రియలో రైతన్నలు కష్టనష్టాల పాలవుతున్నారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. మంగళవారం ఖైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో పర్యటించి దిగుబడుల విక్రయాల్లో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం యార్డు ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు, నిర్వాహణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి స్థాయిలో వైఫల్యం చెందాయని ఆరోపించారు. సీసీఐ విధిస్తున్న నిబంధనలతో పత్తి రైతులు పడరాని పాట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దిగుబడులు ఎలా అమ్ముకోవాలో తెలియక సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల ఎంపిక కోసం విధించిన ఎల్ -1, ఎల్ -2, ఎల్ -3 నిబంధన తొలగించాలన్నారు. కిసాన్ కపాస్ యాపును ఎత్తివేసి ఎకరాకు క్వింటాళ్ల పరిమితిని ఏడు క్వింటాళ్ల నుంచి ఇది వరకటి లాగే 12 క్వింటాళ్లకు పెంచాలన్నారు. తేమ శాతంలో సైతం సడలింపులు చేపట్టాలన్నారు. సోయా కేంద్రాల్లో రైతన్నలు అగచాట్ల పాలవుతున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతన్నలను కంటికి రెప్పలా కాపాడుకున్నామని తెలిపారు. రైతన్నలకు అనువైన విధానాల ద్వారా చివరి ధాన్యం గింజ వరకు కొనుగోల్లు చేపట్టామన్నారు.ఇందులో బోథ్ ఎమ్మెల్యే అనిల్, మాజీ మంత్రి జోగు రామన్న, ఖానాపూర్ నియోజక వర్గ పార్టీ ఇన్‌చార్జీ జాన్సన్ నాయక్, జిల్లా అధ్యక్షుడు రాంకిషన్ రెడ్డి, ముథోల్ నియోజక వర్గ సమన్వక కమిటీ ప్రతినిధులు విలాస్ గాదేవార్, రమాదేవి, డా.కిరణ్ కోమ్రేవార్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గంగా చరణ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

పోటాపోటీగా ఫ్లెక్సీల ఏర్పాటు

పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఖైంసా పర్యటనను పురస్కరించుకొని ముథోల్ బీఆర్ఎస్ సమన్వయ కమిటీ ప్రతినిధులు విలాస్ గాదేవార్, డా. పి. రమాదేవి, డా. కిరన్ కోమ్రేవార్‌లు పోటాపోటీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఖైంసా సరిహద్దు ప్రాంతం నుంచి మార్కెట్ యార్డు వరకు ఫ్లెక్సీలను కట్టారు. మార్కెట్ యార్డు ఆవరణంతా ఫ్లెక్సీలతో నింపివేసారు. భారీ సైజులతో మార్కెట్ యార్డు గులాబీమయ మయ్యింది.

అప్రమత్తంగా పోలీసు శాఖ

బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పర్యటనను పురస్కరించుకొని పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఖైంసాకు వచ్చిన కేటీఆర్‌పై చేదు అనుభవం ఎదురైంది. హిందూవాహినితో పాటు పలు హిందూ సంస్థల శ్రేణులు ప్రచారానికి వచ్చిన కేటీఆర్‌పై రాళ్ళు, టమాటలు తదితర వాటితో దాడికి పాల్పడ్డారు. ఈ దురదృష్టకర సంఘటనలను దృష్టిలో పెట్టుకొని మంగళవారం కేటీఆర్ పర్యటనపై పోలీసు శాఖ ఆద్యాంతం అప్రమత్తంగా వ్యవహరించింది. ఖైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్ సారథ్యంలో టౌన్ సీఐ గోపినాథ్ , ఎస్ఐ సుప్రియలు బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు. డివిజన్ పరిధిలోని అన్ని పోలీసు స్టేషన్ల సీఐలు,ఎస్ఐలతో పాటు ప్రత్యేక పోలీసు బలగాలు,శివంగి బృందం బందోబస్తు విధుల్లో పాల్గొన్నాయి.

రైతు సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

- బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్



జాన్సన్ నాయక్ నేతృత్వంలో ఆదిలాబాద్ తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఖానాపూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతు సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ అన్నారు. మంగళవారం ఖానాపూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పత్తి, సోయా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించేందుకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పర్యటకు రావడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో రైతు సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని జాన్సన్‌డిమాండ్ చేశారు. అనంతరం జాన్సన్ నేతృత్వంలో ఖానాపూర్ నియోజకవర్గం నుంచి కేటీఆర్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రాథోడ్ రాము నాయక్, మాజీ వైస్ ఎంపీపీ గుగ్లావత్ వాల్ సింగ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కరిపే శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాళ్లపెల్లి రాజగంగన్న, పట్టణాధ్యక్షుడు గౌరీకర్ రాజు, జిల్లా నాయకులు రాజేశ్వర్‌గౌడ్, కొక్కుల ప్రదీప్, సల్లా నరేందర్‌రెడ్డి, శనిగారపు శ్రావణ్, కారింగుల సుమన్, తోట సుమిత్, కొక్కుల శేఖర్, తదితరులున్నారు.


అడెల్లిపోచమ్మ ఆలయంలో విజయ డెయిరీ మాజీ చైర్మన్ పూజలు



సారంగాపూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మహా ప్రసిద్ధి చెందిన అడెల్లి పోచమ్మ ఆలయంలో మంగళవారం ఉమ్మడి ఆదిలాబాద్‌జిల్లా విజయ డెయిరీ మాజీచైర్మన్ లోక భూమారెడ్డి పూజలు చేసి మొక్కులను మొక్కారు. ఈ నేపథ్యంలో ఆలయ పూజారి శ్రీనివాస్ అమ్మవారికి హారతి నిచ్చి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ చైర్మన్ సింగం భోజాగౌడ్ ఆయన శాలువాతో సన్మానించారు. నాయకులు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, అయిర నారాయణరెడ్డి, ఉట్ల రాజేశ్వర్,రాజేశ్వర్ రావు, సాకొపెల్లి సురేందర్‌లు ఉన్నారు.

పెరుగుతున్న పొగమంచు.. పొంచి ఉన్న ప్రమాదం

- ఎస్పీ జానకి షర్మిల



ఎస్పీ జానకి షర్మిల

దిలావర్‌పూర్, నవంబరు18(ఆంధ్రజ్యోతి): శీతాకాలం... చలి తీవ్రతపెరిగి వణుకు పుట్టిస్తోంది. తగిన జాగ్రత్తలు పాటించకపోతే ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది. నవంబరు మొదలుకుని జనవరి వరకు చల్లి వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే ఆస్కారమున్నందు వల్ల జిల్లా ఎస్పీజానకి షర్మిల వాహనదారు లకు, జిల్లా ప్రజలకు జాగ్రత్తలు సూచించారు. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా గత ఐదు రోజులుగా చలి తీవ్రత గణనీయంగా పెరిగింది. ఉదయం, రాత్రి వేళల్లో పొగమంచు వల్ల రహదారులపై ముందు ఉన్న వాహనాలు కనిపించకపోవడం వల్ల ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారముంది. తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా ప్రమా దాల బారిన పడకుండా ప్రాణాలు కాపాడుకోవచ్చని జిల్లా ఎస్పీ జానకి షర్మిల పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ రక్షణ కవచం...

- స్పష్టమైనగాజు ఉన్న, బ్రాండెడ్‌హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి.
- హై-బీమ్ వాడకండి, లో-బీమ్ లైట్లు మాత్రమే ఉపయోగించాలి.
- వేగం తగ్గించి ముందున్న వాహనానికి సురక్షిత దూరం పాటించాలి.
- రిఫ్లెక్టివ్ జాకెట్లు, స్టిక్కర్లు వాడుకోవాలి.
- సడన్ బ్రేకులు వేయకుండా జాగ్రత్త పడాలి
- రోడ్డు తడిగా ఉంటే స్కిడ్ అయ్యే ప్రమాదం ఉంది.
- టర్నింగ్ అయ్యే ముందు తప్పనిసరిగా ఇండికేటర్ ఇవ్వాలి.
- రాత్రి వేళ, తెల్లవారు జామున సాధ్యమైనంత వరకు ప్రయాణాలు చేయకపోవడం మంచిది. ఈ రెండు సమయాల్లో పొగమంచు తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

వరి కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా అదనపు కలెక్టర్



వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్

లోకేశ్వరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ మంగళవారం పలు గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం తనిఖీలు చేశారు. లోకేశ్వరం మండలంలోని రాజురాలో గల వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు తీరును పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో గల వసతులను చూశారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ... రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిర్వహించాలని తెలిపారు. ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియను పూర్తి చేస్తూ, సంబంధిత రిజిస్టర్లు అన్నింటినీ పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. మన్మథ్ గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి, అధికారులకు, కూలీలకు పలు సూచనలు చేశారు. అనంతరం మండల తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు.ఈసందర్భంగా రికార్డులను, రిజిస్టర్లను తనిఖీ చేశారు. అధికారులు, సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వర్తించి, ప్రజలకు సేవలు అందించాలని తెలిపారు.

సమ్మె విరమించిన జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు

- నేటి నుంచి యథావిధిగా జరిగిన పత్తి కొనుగోళ్లు



విక్రయించేందుకు ట్రాక్టర్‌లో నింపుతున్న పత్తి నిల్వలు

ఖైంసా, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పలు డిమాండ్ల సాధనతో పాటు సమస్యల పరిష్కారం కోసం జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు చేపట్టిన నిరవధిక సమ్మెను విరమించాయి. ఈ క్రమంలో బుధవారం నుంచి జిన్నింగ్ మిల్లులు తెరుచుకోనుండగా పత్తి కొనుగోళ్ల ప్రారంభం కానున్నాయి.మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావ్, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్ర మోహన్, సీసీఐ సీఎండీ లలిత్ కుమార్ గుప్తాలు తెలంగాణ రాష్ట్ర కాటన్ అసోసియేషన్ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఇందులో కాటన్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపిన సమస్యలు , ప్రతిపాదించిన డిమాండ్లను త్వరితగతిన పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతామని మంత్రి తుమ్మలతోపాటు సీసీఐ సీఎండీ లలిత్ కుమార్ గుప్తాలు హామీనిచ్చారు. అంతేకాకుండా పత్తి రైతుల పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని సమ్మెను విరమించి కొనుగోళ్లు చేపట్టాలని అసోసియేషన్ ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించిన కాటన్ అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధులు జిల్లా అసోసియేషన్ ప్రతినిధులతో చర్చించి సానుకూలదృక్పథంలో సమ్మెను విరమించేందుకు గాను నిర్ణయం తీసుకున్నాయి. బుధవారం నుంచి కొనుగోళ్ల యధావిధిగా చేపడుతామని వెల్లడించారు. జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాల సమ్మె విరమణతో పత్తి కొనుగోళ్ల ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతన్న పత్తి దిగుబడులను విక్రయించేందుకు గాను సిద్ధమయ్యారు. మంగళవారం పలు ప్రాంతాల రైతులు పత్తి దిగుబడులను విక్రయించేందుగాను ట్రాక్టర్లలో పత్తి నిల్వలు నింపుకొని విక్రయించేకు గాను అవసరమైన చర్యలకు ఉపక్రమించారు.

కల్లూరులో కేటీఆర్



ప్రజలకు అభివాదం చేస్తున్న మాజీ మంత్రి కేటీఆర్

కుంటాల, నవంబరు 18: (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామరావు జిల్లా పర్యటనలో భాగంగా నిర్మల్ నుంచి ఖైంసా వెళుతున్న సమయంలో కల్లూరులో ఆగి ప్రజలకు అభివాదం చేశారు. ప్రజలు సీఎం అని నినాదాలు చేశారు. పలువురు రైతుబంధు సరిగ్గా రావడం లేదని, ప్రతిపాక్ష పార్టీ హమీల అమలులో విఫలమైందని అన్నారు. దీంతో కేటీఆర్ చిరునవ్వుతో ప్రజలకు అభివాదం చేసి ఖైంసా బయలు దేరి వెళ్లాడు.



బాసరలో జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తున్న యువకులు

శివాజీ మహారాజ్‌పై అనుచిత వ్యాఖ్యలు

- బాసరలో యువకుల నిరసన
- జాతీయ రహదారిపై రాస్తారోకో

బాసర, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): శివాజీ మహారాజ్‌పై యువకుడు చేసిన అసభ్య వాఖ్యలు మంగళవారం బాసరలో ఆందోళనకు దారి తీసింది. బాసరకు చెందిన యువకుడు సోమవారం సోషల్ మీడియాలో ఇష్టమెచ్చినట్లు వాయిస్ మెసేజ్ పెట్టడం ఈ వివాదానికి కారణమైంది వెంటనే పోలీసులు సోమవారం ఆ యువకుడిని గుర్తించి అరెస్టు చేశారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం ఉదయం యువకులు 161వ జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. దాదాపు గంటన్నర పాటు నిరసన తెలిపారు. సదరు యువకుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానికేతరులు బాసరకు వచ్చి హంగామా సృష్టిస్తున్నారని, పుణ్యక్షేత్రంలో భద్రత పెంచాల్సిన అవసరం ఉందని కోరారు. ఖైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్, ముథోల్ సీఐ మల్లేష్, బాసర ఎస్సై శ్రీనివాస్ తదితరులు వచ్చి నిరసనకారులను నచ్చ చెప్పడంతో విమరించారు. అక్కడి నుంచి ర్యాలీగా వెళ్లి దేవస్థానం అధికారులకు గుడికి వచ్చే భక్తులకు రైల్వేస్టేషన్ నుంచి ఆలయానికి సరైన రవాణా సదుపాయం లేదని, దేవస్థానం తరుపున అదనపు బస్సులను ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు. రాత్రిల్లో రైళ్లకు దిగిన ప్రయాణికులు స్థానిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అమ్మవారి దేవస్థానంలో పని చేస్తున్న అన్యమతస్తులను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బాసరకు చెందిన యువకులతో పాటు నియోజక వర్గంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన హిందూ సంఘాల నేతలు కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.

అమ్మవారి హుండీ ఆదాయం రూ. 43 లక్షలు



కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

బాసర, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : బాసర సరస్వతి అమ్మవారి హుండి కానుకలను మంగళవారం ఆలయ అధికారులు లెక్కించారు. రూ. 4316703 నగదు, మిశ్రమ బంగారం 60 గ్రాముల 900 మిల్లి గ్రాములు, మిశ్రమ వెండి ఒక కిలో 550 గ్రాములు, వివిధ దేశాలకు చెందిన 10 కరెన్సీలు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ ఆదాయం మొత్తం 55 రోజుల్లో అమ్మవారికి సమకూరింది. ఈ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ ఈవో అంజనాదేవి, ఏఈవో సుదర్శన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


పాచ్పెరలో గతేడాది చేపట్టిన పనులను పరిశీలిస్తున్న రాష్ట్ర అధికారి

ఉపాధి హామీ పనుల పరిశీలన

బోథ్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొచ్చెర గ్రామంలో 2024-25లో చేపట్టిన భూ అభివృద్ధి పనులకు సంబంధించిన పనులను మంగళవారం రాష్ట్ర క్వాలిటీ కంట్రోల్ అధికారి పరిశీలించారు. పనుల వివరాలను ఏపీఎం జగదేరావు టీఏలతో కలిసి వివరించారు. పూర్తయిన పనులను పూర్తిస్థాయిలో పరిశీలించి నివేదిక సిద్ధం చేయనున్నారు.

గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు: సూపర్ వైజర్

నేరడిగొండ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సీజనల్ వ్యాధుల ప్రబలకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు సూపర్‌వైజర్ సంతోష్ అన్నారు. మంగళవారం మండలంలోని బంధం రెగడి గ్రామంలో వైద్య సిబ్బంది మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రాత్రి మిగిలిన ఆహార పదార్థాలను తినకూడదన్నారు. ఇంటి పరిసరాలతో పాటు శారీరక శుభ్రత పాటించాలని సూచించారు. ఇందులో హెల్త్ అసిస్టెంట్ నర్సయ్య, ప్రధానోపాధ్యాయురాలు శారదా ఆశ లలిత, తదితరులు హాజరయ్యారు.

పీవీటీజీల కోసం నిరంతర పోరాటం

ఉట్నూర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని పీవీటీజీ గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటాలు చేస్తామని పీవీటీజీల ఐక్యవేదిక నూతన కమిటీ ప్రకటించింది. మంగళవారం మండల కేంద్రంలోని కోలాం సేవ సంఘం భవనంలో నిర్వహించిన సమావేశంలో కోలాం, తోటి గిరిజనులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షుడు ఆత్రంబాలేరావు, టేకం భాస్కర్, నైతంరమేఉష్‌ల ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. పీవీటీజీల సంఘం జిల్లా అధ్యక్షుడు టేకం వసంత్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా మేస్రంజైరాం, జిల్లా గౌరవ అధ్యక్షుడిగా వెడ్మశంకర్, జిల్లా ఉపాధ్యక్షుడిగా కుడిమెత భీంరావు, జిల్లా ఉపాధ్యక్షుడిగా మడావి బాలు, జిల్లా ప్రచార కార్యదర్శిగా మడావి నాగోరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కొందరిని ఎన్నుకోవడం జరిగిందని టేకం భాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కుడిమెత తిరుపతి, ఆత్రంబీంరావ్, ఆత్రం ముకుంద్‌రావు, సిడాం రామారావు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీవీటీజీ గిరిజనులలో విద్య, వైద్యం, రైతులకు రుణాలు, యువతకు ఉపాధి అవకాశాలు, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేవిధంగా కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు పేర్కొన్నారు.


మాట్లాడుతున్న నూతన కమిటీ జిల్లా అధ్యక్షుడు టేకం వసంతరావు

ధర్నాలు వద్దు.. సమస్యలన్నీ పరిష్కరిస్తా !

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

ఉట్నూర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రజలు ఎవరూ ధర్నాలు, ఆందోళనలు చేయవద్దని, సమస్యను తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ అన్నారు. మంగళవారం మండలంలోని చెరువుగూడ గ్రామంలో కోలాం గిరిజనులకు మంజూరు అయిన 50 ఇందిరమ్మ ఇళ్ల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఇళ్ల పత్రాలను అందించిన ఎమ్మెల్యే మాట్లాడారు. ఇతర పార్టీలకు చెందిన వారు ప్రజలను తప్పుతోవ పట్టిస్తూ ధర్నాలు ఆందోళనలు చేయిస్తుంటారని, అలాంటి వారి మాటలు పట్టించుకోకుండా గ్రామాలలో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తానని అన్నారు. చెరువుగూడ గ్రామంలో 52 కుటుంబాలు ఉండగా 50 కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గ్రామపటేల్ రాజేశ్వర్, డీసీసీబీ డైరెక్టర్ ఎస్పీరెడ్డి, ఆర్టీఏ జిల్లా సభ్యులు దూట రాజేశ్వర్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు లింగంపల్లి చంద్రయ్య, దాసండ్ల ప్రభాకర్, అజీముద్దీన్, కలీంపాషా, సాడిగే రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


చెరువుగూడెంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

ఉట్నూర్: మండలంలోని బీర్సాయిపేట మాజీ సర్పంచ్ అంకవ్వ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాసనసభ్యుడు వెడ్మ బొజ్జుపటేల్ తెలంగాణ రాష్ట్ర సమితికి చెందిన మాజీ సర్పంచ్ అంకవ్వకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కేటీఆర్‌కు ముక్రా(కె) గ్రామస్థుల ఘన స్వాగతం

ఇచ్చోడ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా ముక్రా(కె) గ్రామస్థులు తమ గ్రామ రోడ్డు వద్ద కేటీఆర్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం అక్కడినుంచి జిల్లాకేంద్రానికి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో నిర్వహించిన సమావేశం ప్రసంగంలో ముక్రా(కె) గ్రామంలో పత్తిరైతులు పత్తి పంట పొలాల్లో ఆందోళన నిర్వహించిన స్ఫూర్తి అభినందనీయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీలు 420 ఫేక్ హామీలపై నిరంతరం పోరాటం చేస్తున్న ముక్రా గ్రామస్థులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి గాడ్గె మీనాక్షి, మాజీ ఎంపీటీసీ సుభాష్, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: పత్తి రైతులకు పరామర్శించేందుకు ఆదిలాబాద్ జిల్లాకు వచ్చిన బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసేందుకు మండల ఆయకులు మంగళవారం భారీ సంఖ్యలో తరలివెళ్లారు. కేటీఆర్‌ను స్వాగతించేందుకు భారీ సంఖ్యలో తరలి రావాలని స్థానిక శాసనసభ్యుడు అనిల్ పిలుపు ఇవ్వడంతో నేరడిగొండ మండలంలోని రోల్‌మామడ గ్రామం వద్ద భారీ సంఖ్యలో తరలివెళ్లిన నాయకులు ఆయనను స్వాగతించారు. మాజీ ఎంపీ తుల శ్రీనివాస్‌తో పాటు సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఎలుక రాజు, ప్రవీణ్, తదితరులున్నారు.


ముక్రా(కె) గ్రామం వద్ద కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు


బోథ్‌లో కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ మండల నాయకులు

రైతులపై బీఆర్ఎస్ నేతల మొసలి కన్నీరు

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ రైతుల కోసం చేసిందేమీ లేదని, అధికారం పోయాక రైతుల పక్షాన పోరాడుతామని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మండిపడ్డారు. ఆదిలాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. కేటీఆర్, మాజీ మంత్రి జోగు రామన్న బీజేపీ ప్రభుత్వంపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీ రైతులకు మద్దతు ధర కల్పించేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. ఇందుకోసం వేల కోట్ల నిధులను వెచ్చించి సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేపట్టారన్నారు. 12 ఏళ్లుగా సీసీఐ కొనసాగిస్తున్న నిబంధనలే ఇప్పుడు కొనసాగుతున్నాయని, అందులో ఎలాంటి మార్పు లేదన్నారు. కేవలం రాజకీయ కోసం బీఆర్ఎస్ సీసీఐ కొత్త నిబంధనలను తీసుకువచ్చిందని అసత్య ప్రచారం చేస్తూ, రైతులను పక్కతోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ కార్యకర్తలనే రైతుల ముసుగులో మాట్లాడించి కేంద్ర ప్రభుత్వంపై, సీసీఐ సంస్థపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. రైతులపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే.. కేంద్రం తీసుకువచ్చిన ఫసల్ బీమా యోజన పథకాన్ని గత ప్రభుత్వం ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఈ మీడియ సమావేశంలో బీజేపీ నాయకులు దయాకర్, లాలా మున్న, సంతోష్, క్రాంతికుమార్, దినేష్ మాటోలియా, కృష్ణ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

'పల్లె పోరు'కు.. సై!

(5వ పేజీ తరువాయి...)

పంచాయతీ ఎన్నికల ను నిర్వహించి కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను రాబట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుంది.

బీసీ స్థానాల్లోనే మార్పు?

పాత రిజర్వేషన్ల ప్రకారమే స్థానిక ఎన్నికలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఇప్పటికే ప్రకటించిన బీసీ స్థానాల రిజర్వేషన్లు మారే అవకాశం ఉంటుందని జోరుగా ప్రచారం జరుగుతోంది. ఎందుకంటే ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించడంపై హైకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. సుప్రీంకోర్టు కూడా అదేరకమైన అభిప్రాయా న్ని వ్యక్తం చేయడంతో ప్రభుత్వం డైలామాలో పడింది. ఎట్టకేలకు పాత రిజర్వేషన్ల ప్రకారమే మొదట సర్పంచ్ ఎన్నికలను నిర్వహించి.. ఆ తర్వాతనే పరిషత్ ఎన్నికలను నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. పార్టీ పరంగా 42 నుంచి 60శాతం వరకు బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలనే యోచనతో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తుంది. బీసీ రిజర్వేషన్‌ల స్థానంలో జనరల్ స్థానాల సంఖ్య పెరిగే అవకాశం లేకపోలేదంటున్నారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్‌లలో మాత్రం ఎలాంటి మార్పులు ఉండవంటున్నారు. రిజర్వేషన్లపై మళ్లీ విధివిధానాలు ఖరారైతే గానీ స్పష్టంగా చెప్పలేని పరిస్థితి ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

అంతా రెడీ.. నోటిఫికేషనే ఆలస్యం

ప్రభుత్వ ప్రకటనతో గ్రామాల్లో మళ్లీ ఎన్నికల సందడి కనిపిస్తుంది. పార్టీల వారీగా అభ్యర్థులను బరిలో దింపేందుకు నేతలు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే రిజర్వేషన్లు కలిసి వచ్చిన వారంతా పోటీకి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. మొదట పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు. దీంతో గ్రామాల్లో విందు రాజకీయా లు ఊపందుకుంటున్నాయి. స్థానిక ఎన్నికలు జరుగడం ఖాయమని తేలిపోవడంతో ఆశావహ నేతలు ఓటర్లను ఆకట్టుకునేందుకు పోటాపోటీ ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యం గా గ్రామాల్లో సామాజిక వర్గాల వారీగా బరిలో నిలిచేందుకు నేతలు సిద్ధమవుతున్నారు.

రైతులకు దక్కని మద్దతు ధర

(5వ పేజీ తరువాయి...)

ని తెలిపారు. పంట కొనుగోళ్లలో బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయడాన్ని ఖండించారు. ఈ నెల 21న అఖిలపక్షం ఆధ్వర్యంలో బోరజ్ వద్ద జాతీయ రహదారిపై చేపట్టిన ధర్నాకు వేలాది మంది రైతులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జోగురామన్న, ఎమ్మెల్యేలు అనిల్‌జాదవ్, కోవలక్ష్మి, ప్రశాంత్‌రెడ్డి, డాక్టర్ సంజయ్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, ఖానాపూర్ ఇన్‌చార్జీ జాన్సన్ భుక్యానాయక్, కోనేరు కోనప్ప, దివాకర్‌రావు, దుర్గంచిన్నయ్య, పార్టీ జనరల్ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్, మాజీ జడ్పీచైర్మన్ రాథోడ్ జనార్ధన్, మారుగొండ రాము, తదితరులున్నారు.

రైతులు.. అధైర్యపడకండి

నేరడిగొండ: రైతులు అధైర్య పడవద్దని మీకు కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మంగళవారం జిల్లా పర్యటనలో భాగంగా మండల కేంద్రంలోని జగదాంబ జీన్నింగ్ మిల్లులో సోయాబీన్, మొక్కజొన్న పంట కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అనంతరం రైతులతో మాట్లాడుతూ సోయా, పత్తి పంట కొనుగోలు చేసేంత వరకు పోరాడదాం అన్నారు. అంతకుముందు రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్‌కు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఘన స్వాగతం పలికారు.

'ఎకరానికి 10 క్వింటాళ్ల కొనుగోలు'

బోథ్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సోయాబీన్ పంట ఎకరానికి 10 క్వింటాళ్ల మేరకు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డుగంగారెడ్డి ఆత్మచైర్మన్ జి.రాజుయాదవ్ తెలిపారు. బయోమెట్రిక్ కాకుండా మొబైల్ ఓటీపీతో పంట కొనుగోళ్లకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. దీంతో రైతులకు ఊరట లభించినట్లు అయ్యింది.

వాట్సాప్ ఫిర్యాదుల ద్వారా విద్యుత్ సమస్యల పరిష్కారం

» సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఏరుకల నారాయణ

తలమడుగు,నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వాట్సప్ ఫిర్యాదుల ద్వారా విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సీజీఆర్ఎఫ్ చెర్మన్ ఏరుకల నారాయణ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తాంసి, బీంపూర్, తలమడుగు మండలాల విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక సీజీఆర్ఎఫ్‌ను తలమడుగు మండల కేంద్రంలోని 33/11 కె.వి సబ్ స్టేషన్‌లో ఏర్పాటు చేశారు. సిజిఆర్ఎఫ్ చైర్ పర్సన్ ఎరుకల నారాయణ బృందం ఆధ్వర్యంలో వివిధ వినియోగదారుల సమస్యల వినతి పత్రాలను పరిశీలించారు. ప్రతివారం పొలంబాట కార్యక్రమాన్ని సబ్ స్టేషన్‌లో మండల అధికారి నిర్వహిస్తారని దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు, ఈ కార్యక్రమంలో వినియోగదారుల ఫోరం సభ్యుడు సలేంద్ర రామకృష్ణ, లకావత్ కిషన్, ఏఈ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా కంది పంట

తాంసి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తెల్ల బంగారాన్ని నమ్ముకున్న రైతన్నకి ఈ ఏడూ కష్టాలతో పాటు నష్టాలు ఎదురయ్యాయి. ప్రస్తుతం కంది పంట పైనే అన్నదాతలు ఆశ పెట్టుకున్నారు. ప్రస్తుతం కంది పంట పూత దశలో ఉంది. తాంసి మండలంలో చాలామంది రైతులు పత్తి పంటతో పాటు అంతర్ పంటగా కంది పంటను సాగు చేస్తుంటారు. అలాగే సోయపంటలో సైతం చాలా మంది రైతులు అంతర్ పంటగా కంది పంటను పండిస్తున్నారు. ప్రస్తుతం ఏ పంట పొలంలో చూసిన కంది పంట ఆశాజనకంగా కనిపించడంతో కనీసం ఈ పంటైన తమను ఆదుకుంటుందని గంపెడాశలతో ఉన్నారు. తాంసి మండలంలో సుమారు 750 ఎకరాలలో కంది పంటను సాగుచేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో పంటకు ఆశించిన స్థాయిలో ధర కూడా కనిపిస్తుంది. కనీసం కంది పంటతోనైనా రైతుల కష్టాలు తీరాలని ఆశిద్దాం.

మొక్కజొన్న డబ్బులు ఇప్పించాలని రైతుల నిరసన

» తహసీల్దార్‌కు వినతి పత్రం

లక్ష్మణచాంద, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మొక్కజొన్న డబ్బులు ఇప్పించాలని భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో మండల రైతులు మంగళవారం నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ సరితకు వినతి పత్రం అందజేశారు. మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం మొక్కజొన్న కొని దాదాపు 50 రోజులు కావస్తున్నప్పటికీ ఇప్పటి వరకు ఖాతాలలో డబ్బులు జమ కాకపోవడంతో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు వాపోయారు. ఈ కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు సంత సాగర్‌రెడ్డి, మండల కమిటీ కార్యవర్గ సభ్యుడు సంత మధుకర్ రెడ్డి, బోడ మహేష్, రేణి భీమేశ్వర్, ముత్యం, గంగన్న, పురుషోత్తం, మల్లేష్ మహేష్, పోశెట్టి, మధు, శ్రీను, గంగాధర్, నరేష్, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా అఖండ హరినామ సప్తాహం

భైంసా రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చుచుంద్ గ్రామంలో మంగళవారం అఖండ హరినామ సప్తా ఘనంగా ముగిసింది. అఖండ హరినామ సప్తా బాలు మహారాజ్ ఆధ్యాత్మిక ప్రవచనాలతో వివరించారు. సిద్దేశ్వరి ఆలయంలో స్వామివారికి కాకడ హారతులతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మెదక్ జిల్లాకు చెందిన బాలు మహారాజ్ భక్తులకు ఉద్దేశించి ప్రవచనాలు చేశారు. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత ఉంటుందని తెలిపారు. దైవ నామస్మరణ చేస్తే భగవంతుడు ప్రీతి పాత్రులవుతామని అన్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరు సన్మార్గంలో నడవాలని సూచించారు. ప్రతి సంవత్సరం గ్రామంలో అఖండ హరినామ సప్త నిర్వహించడం వలన ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక భావనలతో పాటు క్రమశిక్షణ, జీవన విధానం మార్పు వచ్చి వ్యసనాలకు, దురలవాట్లకు దూరంగా ఉండడం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గ్రామ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ ప్రజలు, బీజేపీ మాజీ ఉపాధ్యక్షుడు టి. శ్రీనివాస్, గ్రామ పెద్దలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు, బాలల హక్కులపై అవగాహన

నేరడిగొండ/బోథ్ నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలం లోని కేజీబీవీలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల పాల్గొని మా ట్లాడుతూ బాల్యవివాహం, రక్షణ హక్కు అను అంశాలపై అవగాహన కల్పించడం జరిగింది. బాల్యవివాహాలు వలన కలిగే నష్టాలను విద్యార్థులకు తెలియ చేయడం జరిగింది. ఎంఈవో భూమారెడ్డి మాట్లాడుతూ పిల్లలు ఉన్నత చదువులపై దృష్టిలో పెట్టాలని సూచించారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ రవికాంత్ మాట్లాడుతూ చైల్డ్ హె ల్ప్‌లైన్ 1098, పై అవగాహన కల్పించడం జరిగింది. పిల్లలకు ఎలాంటి సమస్యలు ఉన్న గ్రామాల్లో ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగిన ఈ టోల్ ఫ్రీ నెంబర్‌కి సమాచారం తెలియజేయాల్సిందిగా కోరారు. బాల్యవివాహాలు చేసినచో లక్ష రూపాయల జరిమానా రెండు సంవత్సరాలు జైలు శిక్ష విధించడం జరుగుతుందని అన్నారు. విద్యార్థులకు బాలలహక్కులు తెలియజేసి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో రజిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది, పాల్గొన్నారు.

బోథ్‌లో బాల్య వివాహాల వల్ల ఎన్నో రకాల అనర్థాలు వస్తాయని అయితే బాల్య వివాహాలను చేసి ఆరోగ్యం దెబ్బతినే విధంగా ఎవరు వ్యవహరించవద్దని చైల్డ్‌హెల్ప్‌లైన్ జిల్లా కో ఆర్డినేటర్ సతీష్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పొచ్చెర గ్రామం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాల్య వివాహాలు జరిగితే 1098కు సమాచారం అందించాలన్నారు. బాలల హక్కులకు భంగం కలిగితే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో జిల్లా ఆర్థిక నిపుణుడు నిఖిలేశ్వర్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

ఆదివాసి ధర్మయుద్ధ సభ విజయవంతం చేయాలి

» తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందూర్ దాదిరావ్

ఇంద్రవెల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆదివాసుల హక్కుల సాధన కోసం ఈ నెల 23న ఉట్నూర్‌లో నిర్వహించనున్న ఆదివాసీ ధర్మయుద్ధ సభను విజయవంతం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందూర్ దాదిరావ్ కోరారు. మంగళవారం మండలంలోని దోడంద, గట్టేపల్లి గ్రామంలోని ఆదివాసీలతో సభకు సంబంధించిన పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీల రిజర్వేషన్లను కొల్లగొడుతున్న లంబాడలను తక్షణం ఎస్టీ జాబితా నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. తమ హక్కుల సాధన కోసం ఉట్నూర్‌లో జరగనున్న సభకు ఆదివాసులు వేలాదిగా తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు పూర్క చిత్రు, గౌరవ అధ్యక్షులు జుగ్నాక్ భారత్, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కనక గణేష్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు తోడసం ఇంద్రు, ఆత్రం ధర్ము, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

బాసర లిఫ్ట్ ఇరిగేషన్ పునరుద్ధరణ

» మరమ్మతుల కోసం రూ. 1.17కోట్ల మంజూరు » రైతుల్లో సంబరాలు

బాసర, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : బాసర లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పునరుద్ధరణ మరమ్మతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి 17లక్షల 80వేల రూపాయలు నిధుల మంజూరు చేయడతో ఆయకట్టు రైతులు, వివిధ పార్టీల నాయకుల్లో ఆనందోత్సవాలు వెల్లివిరిశాయి. తమ దీర్ఘకాలిక సమస్యకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం పట్ల కృతజ్ఞతలగా, రైతులు, కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన నేతలు కలిసికట్టుగా తమ సంతోషాన్ని వినూత్నంగా చాటుకున్నారు.

» క్షీరాభిషేకంతో కృతజ్ఞతలు

నిధులు మంజూరయిన నేపథ్యంలో, బాసరలోని స్వామి వివేకానంద విగ్రహం వద్దకు చేరుకున్న రైతులు మంగళవారం ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, ముఖ్యమంత్రి సహా ఇతర ప్రజాప్రతినిధుల పట్ల తమ అభిమాన్ని చాటుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లా ఇంచార్జీ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే రామరావుపటేల్ చిత్రపటాలకు వారు కలిసికట్టుగా పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల మాట్లాడుతూ, లిఫ్ట్ ఇరిగేషన్ పునరుద్ధరణతో వేలాది ఎకరాల వ్యవసాయ భూమికి సారు నీరు అందే అవకాశం ఏర్పడిందని, తమ దీర్ఘకాలిక ఇబ్బందులకు తెరపడుతుందని సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో ఆయకట్టు రైతుల్లో కొత్త ఆశలు చిగురించాయని వారు తెలిపారు. లిఫ్ట్ పునరుద్ధరణ పనులు పూర్తయితే ఈ ప్రాంతంలోని వేలాది ఎకరాలకు సాగు నీరు అందుబాటులోకి రానుంది.

పేదలకు వరంగా సీఎం రిలీఫ్ ఫండ్

» ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్

భైంసా, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యపు సమస్యలతో ప్రైవేట్, కార్పోరేట్ ఆసుపత్రులలో చికిత్సలు నిర్వహించుకున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి వరంగా నిలుస్తోందని ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ పేర్కొన్నారు. మంగళవారం భైంసాలోని క్యాంపు కార్యాలయంలో 50 మంది లబ్దిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. వైద్య సేవల కోసం బిల్లులు చెల్లించిన బాధిత కుటుంబీకులు పూర్తి వివరాలతో సంప్రదిస్తే సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అర్థిక సాయం అందింప చేసేలా కృషి చేస్తామన్నారు. నియోజక వర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన 50 మంది లబ్దిదారులకు రూ.22 లక్షల విలువైన అర్థిక సాయపు చెక్కులను, రూ.2 లక్షల ఎల్‌వోసీ కాపీలను అందచేశారు. ఇందులో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శంకర్ చంద్రే, కాంగ్రెస్ ప్రతినిధులు పురాంశెట్టి రవి కుమార్, గంగారెడ్డి, సుదర్శన్ రెడ్డి, ఓం ప్రకాష్, ప్రేమ్‌నాథ్ రెడ్డి, ముమ్మారి రమేష్, బాసర రమేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల ప్రారంభం

కడెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు మంగళవారం వరి కొనుగోలు కేంద్రాలను ఖానాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పడిగెల భూషణ్ ప్రారంభించారు. కడెం మండలంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో పెద్ద బెల్లాల్, చిట్యాల, దిల్దార్ నగర్, సారంగాపూర్ గ్రామాల్లో పీఏసీఎస్ ద్వారా ఏర్పాటు చేసిన పలు వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మల్లేష్ యాదవ్, పాక్స్ డైరెక్టర్ జి. వెంకటేష్, మాజీ జడ్పీటీసీ తక్కల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ బొడ్డు గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కుభీర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బ్రహ్మేశ్వర్ తండా గ్రామానికి చెందిన జాదవ్ సకరం మహారాజు ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ కళ్యాన్, మాజీ జెడ్పీటీసీ శంకర్‌చౌహాన్, ఏఎంసీ డైరెక్టర్ అరుణ్, పీఏసీఎస్ డైరెక్టర్ వసత్, మాజీ సర్పంచ్‌లు దత్తురాము, దేవేందర్, రోహిదాస్, ఆత్మారామ్, విజయ్‌కుమార్, నాయకులు కదం దత్తురామ్, బెల్లాల గంగాధర్, మిలింద్, లక్ష్మీకాంత్, గ్రామస్థులున్నారు.

'తొలిమెట్టు'ను పకడ్బందీగా నిర్వహించాలి

» అభ్యసన మెరుగుపరిచేలా చూడాలి :వరంగల్ సత్యనారాయణ రెడ్డి


మాట్లాడుతున్న విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు

నిర్మల్ రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : తొలిమెట్టు కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలని విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, వరంగల్ సత్యనారాయణ అన్నారు. జిల్లాలో విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, వరంగల్ సత్యనారాయణ రెడ్డి, రూరల్ మండంలోని ప్రాథమికోన్నత పాఠశాల అక్కాపూర్‌ను మంగళవారం స్పెషల్ క్యాంపెయిన్ 5.0 పరిశీలనలో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో స్పెషల్ క్యాంపెయిన్ కార్యక్రమం అమలు తీరును పరిశీలించారు. పాఠశాల పరిసరాలలో చెత్త, పొదలు, నిల్వ నీరు ఉండకుండా, మూత్రశాలలు, త్రాగునీటి పరిసరాలు మొదలగునవి పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ముఖ్యంగా 3వ తరగతి విద్యా ర్థులకు ఫౌండేషనల్ లెర్నింగ్ స్టడీ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలోహెచ్‌ఎం సుదర్శన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యం

ఆదిలాబాద్‌టౌన్,నవంబరు 18 (ఆంధ్రజ్యోతి):మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ ఆరోపించారు. మంగళవారం ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ స్టాఫ్ అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విలాస్ మాట్లాడుతూ..మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం చెల్లించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు విడుదల చేయాలన్నారు. ప్రమాద బీమాను 25 లక్షలకు పెంచడంతో పాటు మట్టి ఖర్చులు ముప్పై వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 25న హైదరాబాద్ లో తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

నర్సాపూర్(జి), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వరి (దొడ్డు రకం) ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం పీఏసీఎస్ చైర్మన్ పీవీ రమణారెడ్డి ప్రారంభించారు. రైతులందరూ ప్రభుత్వం అందిస్తున్న ఈ కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకుని, కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) పొందాలని ఆయన సూచించారు. ఏ గ్రేడ్ రకం క్వింటాల్‌కు రూ. 2,389, సాధారణ గ్రేడ్ రకం క్వింటాల్‌కు రూ. 2,369 ఉందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్, సీఈవో సుకుమార్, మాజీ సర్పంచ్ రాంరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం ఇంద్రకరణ్ రెడ్డి, కోండ్ర రమేష్, ప్యాట్ల రాజేశ్వర్ రెడ్డి, బర్కుంట గంగారాం, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

యువతకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్ టూ పోస్టుల నియామకాలు విజయవంతంగా పూర్తయిన నేపథ్యంలో మంగళవారం రిమ్స్ ఎదుట ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బోరంచు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్ టూ పోస్టుల కోసం కొన్ని సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నోటిఫికేషన్ విడుదల చేసి పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేసిందన్నారు. ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాలను భర్తీ చేస్తూ యువతకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్‌లు సురేందర్, వెంకన్న, నర్సారెడ్డి, తిలక్, చందు పాల్గొన్నారు.

మార్చి నెలాఖరుకు 100 శాతం ఇంటి పన్నుల వసూలు పూర్తి చేయాలి



చిక్యాల రత్నాకర్ రావు, ఎంపీవో, ఖానాపూర్

ఆంధ్రజ్యోతి: ఖానాపూర్ మండలంలో మొత్తం ఎన్ని ఇళ్లు ఉన్నాయి..? ఇప్పటి వరకు ఇంటి పన్నుల వసూళ్లు ఎంతవరకు పూర్తి చేశారు..?

అధికారి: మండలంలోని 25 గ్రామ పంచాయతీల పరిధిలో 9,173 ఇళ్లు ఉన్నాయి. మొత్తం రూ. 57,66,541 గాను ఇప్పటి వరకు రూ. 3,89,564 వసూలు పూర్తి చేశాం. మార్చి నెలాఖరుకు 100 శాత పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నాం.

ఆంధ్రజ్యోతి: గ్రామాల్లో క్లోరినేషన్ ప్రక్రియ ఏ విధంగా సాగుతోంది..?

అధికారి: ప్రతి గ్రామంలో నెలకు మూడు రోజులు క్లోరినేషన్ ప్రక్రియ సాగుతుంది. ప్రతి నెల 1, 11, 21వ తేదీల్లో మంచినీటి ట్యాంకులలో క్లోరినేషన్ చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ప్లాస్టిక్ నివారణ కోసం గ్రామాల్లో ఎటువంటి చర్యలు చేపడుతున్నారు.?

అధికారి: మండలంలో ప్లాస్టిక్ నివారణకోసం ప్రత్యేకచర్యలు చేపడుతున్నాం.ఐదు గ్రామాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసుకొని ప్లాస్టిక్ నిషేధిం చేందుకు గ్రామ పంచాయతీలలో 300ల చొప్పున స్టీల్ ప్లేట్స్, జగ్గులు, 150 గ్లాసులను అందుబాటులో ఉంచాం. ఆయా గ్రామాల్లో విందు భోజనాలకు ఉచితంగా అందజేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: గ్రామాల్లోపారిశుద్ధ్య కార్యక్రమాలుఏవిధంగా సాగుతున్నాయి?

అధికారి: గ్రామాల్లోపారిశుద్ధ్య లోపం జరగకుండా చర్యలు చేపడుతు న్నారు. మురికి నీటి కాలువలు లేని చోట డ్రైనేజీ నీరు రోడ్ల పైకి రాకుండా ఇళ్లలో ఇంకుడు గుంతలు నిర్మించుకో వాలి. ఇందుకు గాను ఉపాధి హామీ ద్వారా ప్రజలకు నిధులు మంజూరు అవుతాయి.

● ఆంధ్రజ్యోతి ,ఖానాపూర్

ఆంక్షలు లేకుండా కొనుగోళ్లు చేపట్టాలి



కల్లూర్‌లో రోడ్డుపై బైఠాయించిన రైతులు

» సోయా నాణ్యత లేనందునే తిరిగి పంపారని
» కొనుగోలు కేంద్రంలోనే సోయ నాణ్యతను పరిశీలన పరిశీలన తర్వాత గోదాంకు తరలింపు
» మార్క్‌ఫెడ్ డీఎం మహేష్

కుంటాల, నవంబరు, 18: (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పంటలను పండించడం ఒక ఎత్తయితే. పండించిన పంటను విక్రయించుకోవడం మరో ఎత్తుగా మారిందని ఆందోళన చెందుతూ మంగళవారం కుంటాల మండలంలోని కల్లూర్ గ్రామంలో భైంసా - నిర్మల్ జాతీయ రహదారిపై సోయా రైతులు ధర్నా నిర్వహించారు. దాదాపు గంటన్నరకు పైగా రైతులు రోడ్డుపై బైఠాయించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గత నెల 15 రోజుల నుంచి సోయా పంట కోత కోసి బహిరంగ మార్కెట్‌లో ధర తక్కువగా ఉన్నందున ప్రభుత్వం ద్వారా మద్దతు ధర అందుతున్న ఉద్దేశంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు సోయా పంటను ఆరబెట్టి ఇంటి వద్ద ఉంచిన రైతులు కొనుగోలు కేంద్రం ప్రారంభం కాగానే కేంద్రాల్లో తూకం వేసి లారీలో పంపించగా నాణ్యత లేవని అధికారులు గోదాంకు వెళ్లిన లారీని వాపసు పంపారు. దీంతో ఇక్కడి సహకార సంఘం సిబ్బంది కొనుగోళ్లను నిలిపివేశారు. రైతులు తమ గోడును ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక మంగళవారం రోడ్కెక్కి ధర్నా చేశారు. ప్రభుత్వానికి విక్రయిస్తే మద్దతు ధర అందుతుందనే ఉద్దేశంతో కొనుగోలు కేంద్రంలో విక్రయిస్తే సంబంధిత అధికారులు లేనిపోని నిబంధనలతో ఇబ్బందుల పాలు చేస్తున్నారని రైతులు రోడ్డుపై నినాదాలు చేస్తూ మార్క్‌ఫెడ్ డీఎం వచ్చి స్పష్టమైన హామీ ఇచ్చే వరకు భీష్మించుకు కూర్చున్నారు. మార్క్‌ఫెడ్ డీఎం మహేష్ రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం సహకార సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ కొనుగోళ్లు మార్క్‌ఫెడ్ అధికారులు నాఫెడ్ ఆధీనంలో గోదాంకు పంపించడం జరుగుతుందని, నాఫెడ్ అధికారులు సోయాలు నాణ్యతతో లేనందునే తిరిగి పంపారని ఇకనుంచి కొనుగోలు కేంద్రంలోనే సోయాల నాణ్యతను పరిశీలించి గోదాంకు పంపడం జరుగుతుందని తిరిగి వచ్చిన సోయా బస్తాలను కూడా అధికారులతో పరిశీలించి గోదాంకు తరలించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. ధాన్యం త్వరగా కొనుగోలు చేపట్టాలని మార్క్‌ఫెడ్ డీఎంకు వినతి పత్రం అందజేశారు. సంఘటన స్థలానికి భైంసా సీఐ నైలు, ఎస్సై అశోక్, ఏఎస్సై జీవన్ రావు, తహసీల్దార్ కమల్‌సింగ్ సందర్శించారు. పీఏసీఎస్ ఛైర్మన్ సట్ల గజ్జారాం, నాయకులు పడకంటి దత్తు, దీక్షిత్ పటేల్, జక్కుల గజేందర్‌తో పాటు పలువురు నాయకులు రైతులకు సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం ఎలాంటి నిబంధనలు విధించకుండా రైతుల ధాన్యం మొత్తం వెంటను కొనుగోలు చేపట్టాలని పలువురు డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న మార్క్‌ఫెడ్ డీఎం మహేష్

సోయా కొనుగోళ్లలో వేగం పెంచండి



కొనుగోలు సబ్ సెంటర్ వద్ద రైతు గంగుబాయి



తూకం వేసిన సోయా పంట బస్తాలు

» సీఈవో సుకుమార్

నర్సాపూర్(జి), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సోయ కొనుగోళ్లలో వేగం పెంచండి అని సీఈవో సుకుమార్ అన్నారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో దిలావర్‌పూర్ మండల కేంద్రం, నర్సాపూర్ పీఏసీఎస్ సబ్ సెంటర్‌లలో ఏర్పాటు చేసిన సోయాబీన్ కొనుగోలు కేంద్రాలలో నాణ్యత సమస్యల కారణంగా తూకం వేయడంలో జరుగుతున్న జాప్యంపై రైతులు తీవ్రఆందోళన వ్యక్త చేస్తున్నారు. అకాల వర్షాల వల్ల ఇప్పటికే పంట దిగుబడి తగ్గి నష్టపోయిన రైతులు ఇప్పుడు తమ ధాన్యాన్ని అమ్ముకోలేక దిక్కుతోని స్థితిలో ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల తాజా పరిస్థితి

దిలావర్‌పూర్ మండల కేంద్రంతో పాటు నర్సాపూర్ (జి) పీఏసీఎస్ సబ్ సెంటర్‌లలో కలిపి ఇప్పటి వరకు మొత్తం 3,970 బ్యాగులు (50 కిలోల చొప్పున) తూకం వేయగా, అందులో నుంచి 2,787 బ్యాగులు డిస్పాచ్ అయ్యాయి. అయితే నాణ్యత లేని కారణంగా 171 బ్యాగులు తిరిగి వెనక్కి (వాపస్) వచ్చాయని పీఏసీఎస్ సీఈవో సుకుమార్ తెలిపారు. ఇంకా 1183 తూకం వేసిన బ్యాగులు పంపించాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు.

రైతుల ఆవేదన

కొనుగోలువేగం లేకపోవడ వల్లరైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నర్సాపూర్ సబ్ సెంటర్‌కు పంటను తీసుకువచ్చిన రైతులు అప్పాల రాజ గంగు బాయి తన ఆవేదనను వ్యక్తం చేస్తూ, అకాల వర్షాల వల్ల 15 ఎకరాల్లో కేవలం 20 క్వింటాల్ల సోయా ధాన్యం మాత్రమే పండింది. కష్టపడి తీసుకొచ్చినా అధికారులు తూకం వేయకపోవడంతో ఏం చేయాలో తెలియడం లేదని కన్నీరు పెట్టుకున్నారు.

సమస్య ఎక్కడ..?

బన్సపల్లి పీఏసీఎస్ సీఈవో సుకుమార్ వివరణ ఇస్తూ, కొనుగోలు కేంద్రాల నిర్వహణలో ఉన్న సవాళ్లను తెలిపారు. ఇప్పటికే దిలావర్‌పూర్ నుంచి కొన్ని సోయా పంట లారీలను పంపించగా, అక్కడ తాలు, నాణ్యత లోపం వంటి కారణాల వల్ల కొందరు యజమానులు అన్‌లోడ్ చేసుకోకుండా వాటిని వెనక్కి పంపిస్తున్నారు. ఒక లారీ వాపస్ వస్తే సుమారు రూ. 50,000ల వరకు కిరాయి ఖర్చులు అవుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

అధికారుల హామీ... సర్వేయర్ కోసం ఎదురుచూపులు

ఈ విషయంపై మార్క్‌ఫెడ్ ఉన్నతాధికారులు స్పందించారని, త్వరలో కొనుగోలు ప్రమాణాలను పరీక్షించేందుకు ఒక సర్వేయర్‌ను ఏర్పాటు చేస్తామని సీఈవో సుకుమార్ తెలిపారు. సర్వేయర్ నాణ్యత ప్రమాణాలు పరీక్షించిన తర్వాత, క్వాలిటీ ఉన్న సోయా పంటను మాత్రమే తూకం వేసి కొనుగోలు చేస్తారు. అయితే తూకం వేసిన ప్రతి బస్తాకు క్యూఆర్ కోడ్, రైతు పేరు వంటి పక్కందీగా నమోదు చేస్తున్నప్పటికీ నాణ్యత లేదు అనే సాకుతో కొనుగోలు ఆలస్యం చేయడంపై రైతులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు.

రైతుల విజ్ఞప్తి

ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి నాణ్యత పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని, తూకం వేసిన సోయా బస్తాలను వెంటనే కొనుగోలు చేసి, రైతుల ఇబ్బందులను తొలగించాలని రైతులు ఉద్వేగం గా కోరుతున్నారు. రైతులు పడిన కష్టాన్ని గుర్తించి, ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బోథ్ మండల సమస్యలపై ఐటీడీఏ పీఓకి వినతి



ఐటీడీఏ పీఓని కలిసిన ఆడేగజేందర్

బోథ్/నేరడిగొండ. నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బోథ్ మండలంలో నెలకొన్న సమస్యల పైన కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడగజేందర్ ఐటీడీఏ పీఓ యువరాజ్ మర్మాట్‌కు విన్నవించారు. మంగళవారం ఉట్నూర్‌లో పీఓను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన బోథ్ మండలంలోని రఘునాథ్‌పూర్ గ్రామ పాఠశాలలో ఉపాధ్యాయుడు నియమించాలని కోరడం జరిగింది. అంతేకాక మండల కేంద్రంలో ఆసుపత్రి వద్ద 108 వాహనాన్ని అందుబాటులో ఉంచాలని పీఓ దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ హాస్టళ్లో వి ద్యార్థులు వాటర్ హీటర్లు లేక చన్నీల స్నా నాలు చేయాల్సి వస్తుందని వెంటనే సోలార్ హీటర్లను అన్ని సంక్షేమ హాస్టల్లో ఏర్పాటు చేయాలని కోరారు.ఐటీడీఏ దారా 108 అం బులెన్స్‌ను అందుబాటులో ఉంచాలని కోరా రు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులున్నారు.

ముగిసిన సప్తాహం

లోకేశ్వరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మన్మధ్ గ్రామంలో వారం రోజుల క్రితం ప్రారంభమైన హనుమాన్ సప్త వేడుకలు మంగళవారంతో ముగిశాయి. స్వామివారిని గ్రామ ప్రధాన వీధుల గుండా పల్లకి శోభాయాత్ర నిర్వహించారు. భక్తులు భక్తి శ్రద్ధలతో భజనలు చేశారు. శోభాయాత్ర అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు,యువకులు, తదితరులు పాల్గొన్నారు.

పూజారులకు దుప్పట్లు అందజేత



దుప్పట్లు అందజేస్తున్న దృశ్యం

నిర్మల్‌రూరల్,నవంబరు 18(ఆంధ్ర జ్యోతి) : పట్టణంలోని గండి రామన్న దత్తసా యి ఆలయంలో గల పూజారులకు మంగళ వారం చలి తీవ్రతను గమనించి వారికి దుప్పట్లు అందజేసినట్లు కరిపే అజయ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయి దీక్ష సేవా సమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్ రెడ్డి, శ్రీనివాస్, ఉప్పుల నందు, సాయి భక్తులు, పూజారులు పాల్గొన్నారు.

జాడు చాలావో యాత్ర

నిర్మల్ రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో మహాలక్ష్మి ఆలయ సమీపంలోని ఇందిరమ్మ కాలనీలో జాడు చాలావో యాత్ర జిల్లా అధ్యక్షులు సయ్యద్ హైదర్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఇందిరమ్మ కాలనీ ప్రజలకు కనీస వసతులు లేకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్. వినోద్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ బి. శ్రీనివాస్, అబ్దుల్ సాదిక్, యాకిన్, షేక్ ఇమామ్, హైమత్, తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన చలి తీవ్రత

» పడిపోయిన ఉష్ణోగ్రతలు
» ఇబ్బంది పడుతున్న జనాలు
» విధులకు ఇబ్బందులు



ఉదయం పూట వెచ్చని దుస్తులు ధరించి వాకింగ్ చేస్తున్న వాకర్లు

ఆదిలాబాద్/బోథ్/ఇచ్చోడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గత కొద్ది రోజులుగా చలితీవ్రత పెరిగి పోవడంతో వామ్మోచలి అంటూ జనం వణికి పోతున్నారు.మంగళ వారం ఆదిలాబాద్ జిల్లా సగటు గరిష్ట ఉష్ణోగ్రత 27.8 కాగా కనిష్ఠంగా 9.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే అత్యల్పంగా బజార్‌హత్నూర్ మండలంలో 8.9,బోథ్ మండలం పొచ్చెరలో 9.0, భీంపూర్ మండలం అర్లి(టి)లో 9.1, సాత్నాలలో 9.6, తలమడుగులో 9.7, మావలలో 10.1, సిరికొండలో 11.6 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 14 డిగ్రీల లోపే కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మరో రెండు మూడు రోజుల పాటు ఇవే పరిస్థితులు ఉంటాయని వాతావరణ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు. రాత్రి పగలు అనే తేడా లేకుండా చలితీవ్రత కనిపిస్తుంది. దీంతో ప్రజలు వెచ్చని దుస్తులు ధరించి బయటకు వెళ్లే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఉదయం రాత్రుల్లో చలి మంటలు వేసుకుంటు వెచ్చదనం పొందుతున్నారు.చలితీవ్రత కారణంగా పాఠశాలల సమయంలో మార్పులు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. గత కొద్ది రోజులుగా భీంపూర్,సోనాల, బోథ్ (పొచ్చెర), బజార్ హత్నూర్ మండలాల్లోనే అత్యల్పంగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.చలితీవ్రతతో వ్యవసాయ పనులు కొంత ఆలస్యంగా ప్రారంభమవుతున్నా యి. ఉదయం వేళల్లో రైతులు వ్యవసాయ పనులకు వెళ్లడం లేదు.కార్మికులు, కూలీలు, పాల వ్యాపారులు,వాకర్స్ తీవ్రఇబ్బందులకు గురవుతున్నారు.మరికొన్నాళ్ల పాటు చ లితో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

చలితో విధుల నిర్వహణకు ఇబ్బందులు

సోనాల మండలంలో చలి తీవ్రత అత్యధికంగా 7.7 డిగ్రీలుగా ఉండడంతో జనం వణికి పోతున్నారు. ముఖ్యంగా రాత్రిపూట సరిహద్దు గ్రామమైన ఘన్పూర్ చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహించే సిబ్బంది వణికి పోతున్నారు. చలి తీవ్రతకు విధులు నిర్వహించే మార్కెటింగ్ ఎక్సైజ్ వ్యవసాయ శాఖ అటవి శాఖ సిబ్బంది పనికి పోతున్నామని వాపోతున్నారు. ఎన్నడు లేని విధంగా చలితీవ్రత రోజు రోజుకు పెరిగి పోతుండడంతో విధులు నిర్వహించే సిబ్బంది సతమతమవుతున్నారు. మరోవైపు రాత్రిపూట పంట కాపలకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొవాల్సి వస్తున్నది. పంట కాపలాకు వెళ్లక పోతేవన్యప్రాణులతో పంట ధ్వంసం అయ్యే అస్కారం ఉన్నందున చలిని సైతం లెక్క చేయకుండా కాపలకు వెళ్తున్నారు.ఉదయం పూట పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇచ్చోడలో శీ తాకాలం ప్రారంభవేల ప్రకృతి తన సొగ సు లు చూపిస్తూ ఆహ్లాదపరుస్తుంది. శీతాకా లంలో కురిసే మంచు వల్ల ప్రకృతి మసక వెలుతురులో అద్భుతంగా కనులవిందుగా కనిపిస్తుంది. మంగళవారం ఉదయం మంచు దుప్పటి లో శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయం కనువిందు చేసింది. పూర్తిగా మంచుతో కప్పుకున్న ఆహరిహరసుతుడి సన్నిదానం చిత్రం మీకోసం..

క్రైం సమాచారం

నీలుగాయిని వేటాడిన కేసులో నలుగురి రిమాండ్



నలుగురిని రిమాండ్ చేసిన అటవి శాఖ అధికారులు

ఉట్నూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీర్సాయిపేట అటవీ రేంజ్ పరిధిలోని అడవుల్లో నీలుగాయిని వేటాడి చంపిన కేసులో నలుగురిని మంగళవారం రిమాండ్‌కు తరలించడం జరిగిందని ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ ఈర్ల అరుణ తెలిపారు. వన్యప్రాణులను వేటాడడం నిషేధం ఉన్నప్పటికి మండలంలోని మొర్రిపేట్, జెండాగూడ, భీముగూడకు చెందిన గిరిజనులు నీలుగాయిని వేటాడి చంపినట్లుసమాచారం అందడంతో వారి వద్ద నుంచి కలేబారాలతో పాటు వండిన కూరను కూడా స్వాధీనం చేసుకుని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో నలుగురు నిందితులు సోము, బాపురావు, ఆత్రంయాదవ్‌రావు, ఆత్రం రాములను హాజరు పరచగా జూనియర్ సివిల్ న్యాయాధికారి నిందితులకు 18 రోజుల రిమాండ్ విధించడంతో జిల్లా జైలుకు పంపించామన్నారు. ఈ కేసులో ఆరుగురు నిందితులుగా కాగా మరో ఇద్దరు పరారీలో ఉన్నారని ఎఫ్ఆర్ఓ పీర్ల అరుణ తెలిపారు.

ఆరోపణలు చేసిన వారిపై ఎస్పీకి ఫిర్యాదు

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పాయికి ఆదిలాబాద్ జిల్లాతో ఉన్నటువంటి అనుబంధానికి గుర్తుగా దేవిచంద్ చౌక్‌లో ఆయన విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తున్న వారి పట్ల కొందరు బీజేపీ నాయకులు చందాలు వసూలు చేసేందుకే విగ్రహం ఏర్పాటు చేస్తున్నారని అనవసర ఆరోపణలు చేశారని, వీటిపై ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు ఛాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర అధ్యక్షుడు జనగం సంతోష్ తెలిపారు. 50 ఏళ్ల క్రితం వాజపేయి దేవిచంద్ చౌక్‌లో పర్యటించినందుకు గుర్తుగా ఆయన విగ్రహం ఏర్పాటుకు తాము కృషి చేస్తున్నామన్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమానికి సహకరించకుండా ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఉపాధ్యాయుడి మృతి



ప్రశాంత్(ఫైల్)

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజుల కిందట ఆదిలాబాద్ పట్టణంలోని అశోక్ రోడ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ప్రభుత్వ ఉపాధ్యాయుడు ప్రశాంత్ మంగళవారం మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే పట్టణంలోని శాంతినగర్‌లో నివాసముండే ప్రభుత్వ ఉపాధ్యాయుడు ప్రశాంత్ స్థానిక అశోక్ రోడ్ వద్ద ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో తీవ్ర గాయాల పాలైన ఆయ నను హుటాహుటిన రిమ్స్‌కు తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు మెరుగైన చికిత్స కోసం పంపగా.. చికిత్స పొందుతూ తనువు చాలించాడు. దీంతో బాధిత కుటుంబంలో తీవ్ర విషాద చాయలు అలుముకున్నాయి.

బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరం



విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్ ప్రవీణ్ కుమార్

ఇంద్రవెల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి):బాల్య వివాహాలను నిరోధించడం ప్రతీఒక్కరి బాధ్యత అని తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానికజడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణలో మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ అధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో నెల రోజుల కార్యక్రమంలో భాగం గా బాల్య వివాహాలు, శిశు విక్రయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ చదువుకునే వయస్సులో చదువు మీద మా త్రమే ఏకాగ్రత ఉన్నప్పుడే అనుకున్న లక్ష్యాలను చేరుకోగలమన్నారు. బాల్య వివాహాలతో అనారోగ్య సమస్యలు వస్తాయని.బాల్య వివాహాలను చేయడం,ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమన్నారు. అనంతరం విద్యార్థినులచే బాల్య వివాహాలు, శిశు విక్రయాలను అరికట్టాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కా ర్యక్రమంలో సీడీపీవో ఉమాదేవి, ఎంపీడీవో జీవన్ రెడ్డి, ఎంఈవో రాథోడ్ మానుకుమార్, ఐకేపీ ఏపీ ఎం మంజుల, డీహెచ్ఈడబ్ల్యు కో టేశ్వర్,పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో గర్భిణి ప్రసవం

భైంసా, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పురుటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణీ ఒకరు ప్రసవ నిమిత్తం 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో పండంటి మగశిశువుకు జన్మనిచ్చింది. మంగళవారం ముథోల్ మండలంలోని పిప్రి గ్రామానికి చెందిన సారిక అనే గర్భిణీ ప్రసవ వేదనతో ఇబ్బందులు పడింది. దీంతో కుటుంబీకులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. పైలెట్ గంగాధర్, ఈఎంటీ లక్ష్మణ్ పూజారిలు అంబులెన్స్‌తో పిప్రి గ్రామానికి వెళ్లి గర్భిణీ భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించే చర్యలు చేపట్టారు. పురిటి నొప్పులు అధికమవ్వడంతో గర్భిణీ మార్గ మధ్యంలోని దేగాం గ్రామ సమీపంలో పండంటి మగ శిశువుకు జన్మనిచ్చింది. ఈఎంటీ లక్ష్మణ్ పూజారి గర్భిణీకి సుఖ ప్రసవం జరిగేలా చర్యలు చేపట్టారు. అనంతరం బాలింతరాలు, పసికందులను భైంసా ఏరియా తరలించారు. ప్రస్తుతం తల్లి,బిడ్డలు క్షేమంగా ఉన్నారని ఏరియా ఆసుపత్రి వైద్య బృందం వెల్లడించింది.

బాసర రైల్వే స్టేషన్‌ను అధునికీకరించాలి



ఎస్‌సీఆర్ జనరల్ మేనేజర్ వినతి పత్రం ఇస్తున్న ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్

భైంసా, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రయాణీకుల రద్దీని దృష్టిలో పెట్టుకొని బాసర రైల్వే స్టేషన్‌లో అన్ని రకాల వసతులు, సౌకర్యాలు మెరుగుపరచి పూర్తి స్థాయిలో అధునీకరించాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్ దక్షిణ మధ్య రైల్వే అధికారులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ వాస్తవను కలిసి సంబంధిత విషయంలో వినతి పత్రం అందచేశారు. చదువుల తల్లి కొలువైన బాసర రైల్వే స్టేషన్‌లో ఇక్కడి స్టేషన్ మీదుగా రాకపోకలు నిర్వ హించే అన్ని రైలులను ఆగే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. నయగావ్ వద్ద అండర్ బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టాలన్నారు. ప్రయాణీకులకు అన్ని రకాల మౌళిక వసతులు కల్పించాలన్నారు. ఎమ్మెల్యే పాటి ల్ వెంట సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ఉన్నారు.

హరినామ భక్తజన సంద్రం



శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

కుభీర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కుభీర్‌లో మంగళవారం హరినామ స్మరణతో మారుమ్రోగింది. భారీగా వచ్చిన భక్తులతో జన సంద్రంగా మారింది. వారం రోజులుగా శ్రీ విఠలేశ్వరస్వామి ఆలయంలో కొనసాగుతున్న అఖండ హరినామ సప్త ముగిసింది. వేకువ జామున ఆలయంలోని దేవతామూర్తులకు పురోహితుడు ప్రమోద్ జోషి వేద మంత్రాలతో పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో కాగడ హారతి నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల ప్రజలు, పొరుగున ఉన్న మహారాష్ట్ర భక్తులు వేలాదిగా తరలివచ్చి ఆలయంలో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. సప్తహ ముగింపు రోజు విఠలేశ్వర స్వామి ఆలయ జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. జాతరలో వెలసిన దుకాణాల వద్ద మండల వాసులు మహిళలు పెద్ద ఎత్తున కొనుగోళ్లు చేశారు. రంగుల రట్నాలు, ఆటల ప్రాంగణాల్లో చిన్నారులు భారీగా సందడి చేశారు.

● కన్నుల పండువగా రథం ఊరేగింపు...

విఠలేశ్వరస్వామి ఉత్సవాలు ముగింపు సందర్భంగా మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన రథం ఊరేగింపు కన్నుల పండువగా జరిగింది. ఉదయం రంగురంగుల పూలతో అలంకరించిన ఆలయ రథంలో విఠలరుక్మిణీ దేవత ఉత్సవ మూర్తులను ఉంచి గ్రామంలోని ప్రధా వీధుల గుండా భక్తి కీర్తనలు, సాంప్రదాయ భజనలు, బ్యాండు మేళాలతో శోభయాత్రగా వెలుతూ గ్రామంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. తమ ఇంటి ముందు వచ్చిన రథంలోని ఉత్సవ మూర్తులకు మహిళలు పూజలు చేశారు.

● 40 క్వింటాళ్ల భారీ అన్నదానం

సప్తహ ముగింపు రోజున విఠలేశ్వలేశ్వర స్వామి ఆలయం ఆవరణలో భారీగా అన్నదానం చేయడం ఆనవాయితీగా వస్తోంది. దర్శనానికి వచ్చే వేలాది మంది భక్తులకు కుభీర్ గ్రామ యాదవ, మున్నూరుకాపు సంఘాల ఆధ్వర్యంలో భారీ అన్నదానం చేయడం గత కొన్నేళ్ల ఆనవాయితీగా వస్తోంది. జాతరకు వచ్చిన భక్తుల కోసం మంగళవారం 40 క్వింటాళ్ల అన్నదాన చేశారు. అన్నదాన కార్యక్రమంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కుభీర్ ఎస్సై కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

● పలువురికి తులసి మాలాధారణ

విఠలేశ్వర స్వామి సప్తహ ముగింపు వేడుకల్లో భాగంగా ఆలయానికి వచ్చిన దాదాపు 25 మంది భక్తులు ప్రముఖ పరమేశ్వర్ మహారాజ్‌తో తులసి మాలధారణ చేశారు. మాల ధారణ చేసిన భక్తులు తమ జీవితకాలంలో మద్యం, మాంసం, తో పాటు వ్యసనాలకు దూరంగా ఉండి, ఇతరుల బాగు కోరుకుంటూ పాండురంగ సేవలో ఉండి భక్తిమార్గంలో నడుచుకోవాలని సూచించారు.

ఘనంగా ఫ్రెషర్స్‌డే

ఉట్నూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వజూనియర్ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్‌డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ ధనరాజ్ మాట్లాడుతూవిద్యార్థులకు చదువు సంస్కారం గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్ సువర్ణ, శ్రీలత, గణేష్, వినోద్, లక్ష్మణ్, తిరుపతి, సుజాత, దత్తు, అశ్విన్‌చౌహాన్, సుధాకర్, విష్ణు, సిబ్బంది మల్లేశం, ప్రకాష్, సాయికృష్ణ, అజీజ్‌ఖాన్, సుగందబాయిలు పాల్గొన్నారు



22)ఉట్నూర్ ప్రభుత్వ జూనియర్ క



20న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం

ఆదిలాబాద్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 20న ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని జిల్లా సంక్షేమ అధికారి మిల్క ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10గంటలకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి వయోవృద్ధులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఇందులో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ రిమ్స్ ఆసుపత్రి వైద్య సిబ్బందితో ఉదయం 9.30గంటలకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.

జిల్లాకు ప్రతిష్టాత్మక జాతీయ పురస్కారం

- 'జల్ చంచాయ్-జన్ భాగీధారీ'లో జిల్లాకు మొదటి స్థానం
- రాష్ట్రపతి నుంచి అవార్డును అందుకున్న కలెక్టర్



జాతీయ పురస్కారం స్వీకరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ రాజర్షి షా మరో ప్రతిష్టాత్మక అవార్డును స్వీకరించారు. జిల్లాలో జల సంరక్షణ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసినందుకు గుర్తింపుగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జల్ చంచాయ్ - జన్ భాగీధారీ కార్యక్రమంలో ఆదిలాబాద్ సౌత్ జోనల్‌లో మొదటి స్థానం సాధించింది. అవార్డుతో పాటు రూ.2 కోట్ల నగదు ప్రోత్సాహాన్ని కేంద్రం ప్రకటించింది. కేంద్ర జనశక్తి మంత్రిత్వశాఖ ఈయేడు సెప్టెంబరు 26న సంబంధిత ఉత్తర్వులను జారీ చేయగా... మంగళవారం న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ పురస్కారం అందుకున్నారు. జిల్లాకు జాతీయ స్థాయి గుర్తింపు పట్ల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

నార్నూర్: జల సంరక్షణ నీటి వనరులను సద్వినియోగంలో కలెక్టర్ జాతీయ పురస్కారం అందుకోవడం పట్ల దళిత, గిరిజన సంఘాలు మహార్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాంతరావు దుర్గే, కొరెలా మహేందర్, లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు ప్రకాష్ చవాన్, రమేష్ రాథోడ్, వడ్డెర సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ అధ్యక్షులు గుంజ చిన్నయ్య తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

రైతుకు దక్కని మద్దతు ధర

- పత్తి రైతులను చిత్తు చేయడానికే ప్రభుత్వాలు ఉన్నాయి
- ఎకరాకు 7క్వింటాళ్లు కొంటామంటే ఎలా కుదురుతుంది?
- 20-22 తేమ శాతం ఉన్నా.. కొనుగోలు చేయాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం



సీసీఐ అధికారికి వినతిపత్రాన్ని అందజేస్తున్న కేటీఆర్, బీఆర్ఎస్ నేతలు



నేరడిగొండలో రైతులతో మాట్లాడుతున్న కేటీఆర్

ఆదిలాబాద్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రైతులపై ప్రేమ ఉన్న వారికే రైతు సమస్యలు తెలిసే అవకాశం ఉంటుందని, మద్దతు ధర ఏ ఒక్క రైతుకు దక్కడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. క్వింటాల్ పత్తికి రూ.5,900 నుంచి రూ.6200 వరకు మాత్రమే దక్కుతుందన్నారు. దీంతో ఒక్కో క్వింటాలుపై రూ. 1500 నుంచి రూ.2వేల వరకు నష్టం వాటిల్లుతుందన్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులతో ఏర్పాటు చేసిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని రైతుల సమస్యలను తెలుసుకున్నారు. సీసీఐ అధికారులకు పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రైతు సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని రైతులు అధైర్యపడవద్దన్నారు. రాష్ట్రంలో రైతులు సంతోషంగా ఉన్నారని ఎలాంటి ఇబ్బందులు లేవంటూ చెబుతున్న ప్రభుత్వం మార్కెట్‌యార్డును ఎందుకు బంద్ చేసిందో చెప్పాలన్నారు. చలితీవ్రత విపరీతంగా పెరగడంతో సాధారణంగానే అధిక తేమ వస్తుందని ఇలాంటి పరిస్థితులతో 8నుంచి 12శాతం తేమ ఎలా ఉంటుందని ప్రశ్నించారు. 20 నుంచి 22 వరకు తేమ శాతం ఉన్న పత్తిని కొనుగోలు చేయాలన్నారు. రైతులు ఆత్మహత్యలు చేసుకోవద్దని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను తరిమికొడితేనే సమస్యలు పరిష్కారమవుతాయ

(తరువాయి 6వ పేజీలో....)



నీళ్లతో నిండిన మత్తడివాగు ప్రాజెక్టు దృశ్యం

నిండుకుండలా మత్తడివాగు

- రబీకి ఢోకా లేదని రైతుల ఆశాభావం

తాంసి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మత్తడివాగు ప్రాజెక్టుకు జలకళ వచ్చింది. ఈ యేడు వర్షాలు సమృద్ధిగా కురిశాయి. దీంతో ప్రాజెక్టు పూర్తిగా నిండి కనువిందు చేస్తుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 277.50 మీటర్లు కాగా.. ప్రస్తుతం 276.20 మీటర్లకు చేరుకుంది. ప్రస్తుతం ప్రాజెక్టు నిండుకుండలా కనిపిస్తుంది. అంతర్ రాష్ట్ర రహదారికి ఆనుకొని ఈ ప్రాజెక్టు ఉండటంతో వచ్చి పోయేవారు కొద్దిసేపు ప్రాజెక్టు వద్ద సేదతీరి వెళుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోని నీటిని చూస్తే రబీ సాగుకు పూర్తిస్థాయి నీరు అందే అవకాశాలు ఉన్నాయని రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా 8,500 ఎకరాలకు సాగునీరు అందించవచ్చు అంటున్నారు. అప్పుడే పత్తి పంటను తొలగించి రబీ సాగుకు రైతులు సన్నద్ధ మవుతున్నారు. ప్రాజెక్టుల్లో నీరు సమృద్ధిగా ఉండటంతో రబీ అయిన తమను ఆదుకుంటుందని అన్నదాతలు ఆశపడుతున్నారు.



ఆదిలాబాద్ పరిసర ప్రాంతాలను కమ్మేసిన పొగమంచు

వామ్మో.. చలి!

- బజార్‌హత్నూర్‌లో అత్యల్పంగా 8.9 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు 7వ పేజీలో..



జిల్లాలో గ్రామ పంచాయతీలు	473
వార్డుల సంఖ్య	3,870
మొత్తం ఓటర్లు	4లక్షల 47వేల 135
మహిళా ఓటర్లు	2లక్షల 28వేల 436
పురుష ఓటర్లు	2లక్షల 18వేల 683
ఇతరులు	16 మంది

పల్లె పోరుకు.. సై!

ఎట్టకేలకు స్థానిక ఎన్నికలపై..

రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వడంతో ఇక పల్లెపోరుకు సై అంటున్నారు. త్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందన్న వార్తలు రావడంతో ఆశావహ నేతలు, అధికారులు అప్రమత్తమవుతున్నారు. గతంలోనే ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేసిన ఎన్నికల సంఘం.. హైకోర్టు ఆదేశాలతో అర్ధాంతరంగా రద్దు చేసింది. దీంతో స్థానిక ఎన్నికలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

స్థానిక ఎన్నికలపై క్లారిటీ ఇచ్చిన ప్రభుత్వం


- మొదట పంచాయతీ ఎన్నికలు.. ఆ తర్వాతే పరిషత్ ఎన్నికలు
- సర్పంచ్, వార్డు రిజర్వేషన్లు మారిపోతాయంటూ జోరుగా ప్రచారం
- మళ్లీ ఆశావహుల ప్రయత్నాలు
- జిల్లా పంచాయతీ అధికారులతో ఎన్నికల సంఘం గూగుల్ మీట్
- ఎన్నికలను నిర్వహించేందుకు సిద్ధమంటున్న సంబంధిత అధికారులు
- జిల్లావ్యాప్తంగా 473 గ్రామ పంచాయతీలు

ఆదిలాబాద్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఈనెల 24న హైకోర్టుకు స్థానిక ఎన్నికలపై స్పష్టత ఇచ్చేందుకు సిద్ధమవుతున్న రాష్ట్ర ప్రభుత్వం.. స్థానిక ఎన్నికలపై క్లారిటీ ఇచ్చింది. ఈనెల చివరి వరకు నోటిఫికేసన్ విడుదల చేసి డిసెంబరు 2వ వారంలో ఎన్నికలను నిర్వహించాలని భావిస్తోంది. జిల్లాలో 473 గ్రామ పంచాయతీలు, 3870 వార్డు స్థానాలు, 166 ఎంపీటీసీ స్థానాలు, 20 జడ్పీటీసీ, 20 ఎంపీపీ స్థానాలకు రిజర్వేషన్లను ఇప్పటికే ఫైనల్ చేశారు. గత కొద్ది రోజులుగా ఆశావహ నేతలు ప్రజల మధ్యనే ఉంటూ ఓటర్ల మద్దతును కూడగడుతున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీలో ఆశావహుల సంఖ్య అధికంగానే కనిపిస్తున్నా.. బీఆర్ఎస్, బీజేపీల నుంచి ఎక్కువ మంది నేతలు పోటీకి సిద్ధమవుతున్నారు. ప్రభుత్వ ప్రకటనతో గ్రామాల్లో మళ్లీ స్థానిక ఎన్నికల సందడి మొదలయ్యింది. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో గెలుపొందిన కాంగ్రెస్ ఇదే ఊపులో స్థానిక ఎన్నికలను నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. పోటీ చేసేవారంతా ఓటర్ల మద్దతును కూడగట్టేందుకు వివిధ రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. గత ఎన్నికల్లో ఓటమి పాలైన నేతలంతా సానుభూతి కలిసి వస్తుందన్న ధీమాతో కనిపిస్తున్నారు.

మొదట పంచాయతీకే 'ఓటు'

గతంలో మొదట పరిషత్ ఎన్నికలను నిర్వహిస్తామని ప్రకటించిన ప్రభుత్వం.. తాజాగా పంచాయతీ ఎన్నికలను నిర్వహిస్తామని ప్రకటించింది. జిలాలో 473 గ్రామ పంచాయతీలతో పాటు 3,870 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలను నిర్వహించాలని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. అయితే ఈసారి ముగ్గురు పిల్లలు ఉన్న వారు కూడా స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పిస్తూ గజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. దీంతో పోటీ విపరీతంగా పెరిగే అవకాశం ఉందంటున్నారు. ముఖ్యంగా సర్పంచ్ స్థానాలకు అధిక పోటీ ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. డిసెంబరులో ఎన్నికలను పూర్తిచేసి జనవరి 1 నుంచి పంచాయతీల్లో కొత్త పాలక వర్గాలు కొలువుదీరనున్నాయి. మొదట

(తరువాయి 6వ పేజీలో....)



మూడు దశల్లో ఎన్నికలు

స్థానిక ఎన్నికలపై స్పష్టత రావడంతో ఎన్నికల సంఘం ఆ దిశగా ఏర్పాట్లు చేస్తుంది. మంగళవారం జిల్లా పంచాయతీ అధికారులతో ఎన్నికల సంఘం అధికారులు గూగుల్ మీట్ నిర్వహించారు. ఇప్పటికే ప్రకటించిన ఓటర్ జాబితాతో పాటు అదనపు జాబితాను కూడా త్వరలోనే విడుదల చేయనున్నట్లు తెలుస్తుంది. అలాగే ఓటర్ జాబితాలో ఏమైనా పొరపాట్లు జరిగితే సవరించుకునేందుకు అవకాశం కల్పించనున్నారు. ఎన్నికల సిబ్బంది కొరతతో జిల్లాలో మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలను నిర్వహిస్తామని ఎన్నికల సంఘానికి జిల్లా అధికారులు స్పష్టం చేశారు. ఇప్పటికే పోలింగ్ బూత్‌లు, ఇతరాత్ర ఎన్నిలకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు జిల్లా అధికారులు సిద్ధమవుతున్నారు.

మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలి: ఎమ్మెల్యే పాయల

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వార్డుల్లో నెలకొన్న సమస్యలపై వార్డు అధికారులు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని, ఈనెల ముప్పై లోపు ప్రణాళికలు సిద్ధం చేసి ఉంచాలని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్ తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని పెండింగ్ పనులు, సమస్యల పరిష్కారానికి చేపట్టవలసిన ప్రణాళికలు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసి 30వ తేదీలోపు సిద్ధంగా ఉంచాలన్నారు. మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, సానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్ పాల్గొన్నారు.

నేటి నుంచి యథావిధిగా పత్తి కొనుగోళ్లు

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జిన్నింగ్ మిల్ అసోసియేషన్ పిలుపు మేరకు మిల్లులు మూసివేసిన నేపథ్యంలో పత్తి కొనుగోళ్ల ప్రక్రియ నిలిచిపోయింది. తాజాగా అసోసియేషన్ బంద్ విరమించినందున బుధవారం నుంచి యదావిధిగా కొనుగోళ్లు సాగుతాయని మార్కెట్ అధికారులు తెలిపారు. సీసీఐ తో పాటు ప్రైవేట్ ద్వారా కొనుగోళ్లు జరుగుతాయన్నారు.

ప్రజా ప్రభుత్వంపై విమర్శలు సరికాదు: కంది

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్న పదేళ్లలో ఏనాడు రైతుల గురించి పట్టించుకోని బీఆర్ఎస్ నాయకులు నేడు రైతులపై లేని ప్రేమను ఒలకబోస్తున్నారని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ తప్పిదాలను రాష్ట్ర ప్రభుత్వానికి ముడివేసి మాట్లాడటాన్ని ఖండించారు. కాంగ్రెస్ ప్రజా పాలన పట్ల రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ప్రమాదాల నివారణకు రోడ్ సేఫ్టీ క్లబ్

- కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎస్పీ అఖిల్ మహాజన్
- పాల్గొన్న ఉట్నూర్ అదనపు ఎస్పీ కాజల్ సింగ్, అధికారులు



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

గుడిహత్నూర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 30 శాతం రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా జిల్లాలో మొట్టమొదటిసారిగా రోడ్ సేఫ్టీ క్లబ్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మండలంలోని మన్నూర్ గ్రామ సమీపంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రోడ్ సేఫ్టీ క్లబ్ కార్యక్రమాన్ని ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాలను అరికట్టి ప్రాణ నష్టాన్ని తగ్గించడమే లక్ష్యంగా పోలీసుల శాఖ ఆధ్వర్యంలో నూతన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల వెంట ఉన్న గ్రామాల ప్రజలు, రహదారుల వెంట ఉన్న దాబా యజమానులు, పనివారు, పెట్రోల్ బంక్ వాహన టైర్ల రిపేరు వారు టీ స్టాల్ వ్యక్తులు, రోడ్ సేఫ్టీ క్లబ్‌లో సభ్యులుగా కొనసాగుతారని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 450 గ్రామాలలో ప్రతి గ్రామం నుండి చురుకుగా పనిచేసే యువకులు వ్యక్తులు ఐదుగురు చొప్పున రోడ్ సేఫ్టీ క్లబ్‌లో సభ్యులుగా ఉన్నారన్నారు. వీరి ముఖ్య కర్తవ్యం గ్రామాల్లో రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహన నియమ నిబంధనలు పాటించేలా రోడ్డు నిబంధనలు పాటించేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టడం తీసుకురావడం జరిగిందన్నారు. అలాగే సీపీఆర్ చేసే విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ అదనపు ఎస్పీ కాజల్ సింగ్, ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, ఆదిలాబాద్ ఇండియన్ మెడికల్ అసోసియేషన్, కరీంనగర్ రేణే హాస్పిటల్, మంచిర్యాల మెడి లైఫ్ హాస్పిటల్ డాక్టర్లు, సిఐలు బండారి రాజు, కర్ర స్వామి, డి గురు స్వామి, ఎం. ప్రసాద్, జి. శ్రావణ్, జిల్లాలోని ఎస్ఐలు, రోడ్ సేఫ్టీ క్లబ్ సభ్యులు, ప్రజలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలపై పకడ్బందీగా పర్యవేక్షణ

- పీవో యువరాజ్ మర్మాట్



మాట్లాడుతున్న ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్

ఉట్నూర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్‌లోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల పర్యవేక్షణ పకడ్బందీగా నిర్వహించాలని ఐటీడీఏ పీవో యువరాజ్ మర్మాట్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని పీఎంఆర్సీ భవనంలో ఏర్పాటు చేసిన ప్రధానోపాధ్యాయులు, వసతి గృహ సంక్షేమ అధికారులు, ఏటీడీవోలతో నిర్వహించిన సమావేశంలో పర్యవేక్షణ యాప్ ఐటీడీఏ పల్స్‌ను ఆవిష్కరించారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న రోజువారి మెనూ వివరాలతో ఫొటోను అప్‌లోడ్ చేయడం ద్వారా విద్యార్థులకు అందిస్తున్న భోజనం వివరాలు, ఉపాధ్యాయుల పనితీరు, తరగతి గదుల బోధన అంశాలు తెలుసుకోవచ్చని అన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వచ్చేవారం నుంచి అన్ని కేటగిరీల ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తామని పదవ తరగతి విద్యార్థులకు అమలు చేస్తున్న వంద రోజుల ప్రత్యేక కార్యక్రమం పకడ్బందీగా అమలు చేయాలని ప్రతీ విద్యార్థిపై దృష్టి సారించాలని కోరారు. విద్యార్థులకు శుద్ధజలం తాగుటకు అందించే విధంగా ఆర్ఓ ప్లాంట్ ద్వారా అందించాలని పని చేయని వాటికి వెంటనే మరమ్మత్తులు చేయాలని విద్యార్థులకు అందిస్తున్న నీటినాణ్యత తీసి రోజువారి వివరాలు అందించాలన్నారు. మంచినీటి నాణ్యతను తెలుసుకునే టీడీఎస్ పరికరాలని ప్రధానోపాధ్యాయులకు అందించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లాలోని డీడీలు, ఆర్‌సీఓ, ఏటీడీఓలు, ఏసీఎంఓలు, జీసడీఓలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

- నీలుగాయిని వేటాడిన కేసులో నలుగురు రిమాండ్
- రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఉపాధ్యాయుడు మృతి
- ఆరోపణలు చేసిన వారిపై ఎస్పీకి ఫిర్యాదు
- బాసర రైల్వే స్టేషన్‌ను ఆధునికీకరించాలి

వివరాలు 7వ పేజీలో...

జిల్లా అడవుల్లో అంతరించిపోతున్న జంతుజాలం



ఆదివాసీలకు వివిధ రకాల పక్షుల గురించి వివరిస్తున్న ఫొటోగ్రాఫర్

బోథ్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా అడవులలో అంతరించిపోతున్న జీవజాలం ఉందని, మూడు రోజుల పాటు బోథ్ ప్రాంత అడవులలో సంచరించినట్లు నేచురల్ ఫొటోగ్రాఫర్ సిద్ధార్థ ముఖర్జీ మండలకేంద్రంలో మంగళవారం ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో జలపాతాల అందాలతో పాటు రాత్రిపూట సంచరించే వివిధ రకాల పక్షులు, కీటకాలు, జంతువులు ఉన్నాయన్నారు. అయితే అంతరించి పోయాయి అనుకున్న కొమ్ములదుప్పి, నీటి పిల్లితో పాటు వివిధ రకాల బాతులను గమనించామన్నారు. ఈ అడవుల్లో పులితో పాటు చిరుతలకు అవసరమైన ఆహారంగా ఉపయోగపడే జంతువులు ఉన్నాయని వివరించారు. ఆసియా ఖండంలో జీవించే అనేక రకాల బాతులలో నుంచి ఐదు రకాల బాతులు యేటా ఈ ప్రాంతానికి వలస వస్తున్నాయని పేర్కొన్నారు. అక్టోబరు చివరి నుంచి ఐదు రకాల బాతు జాతులు ఈ ప్రాంతానికి చేరుకుంటాయని ఆయన వివరించారు.

మాదకద్రవ్యాలు ప్రాణాంతకం: సీఐ

ఉట్నూర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలు ప్రాణాంతకం అని, విద్యార్థులు ఎవరూ కూడా చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఉట్నూర్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ గంగారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యాబుద్ధులు నేర్చుకోవాలని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు ప్రాణాంతకమని అన్నారు. ప్రతీ విద్యార్థి క్రమశిక్షణతో ఉంటూ బాగా చదువుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని సూచించారు. ఒకసారి చెడు అలవాట్లకు లోనైతే జీవితాంతం బాధపడాల్సి ఉంటుందని, కన్నతల్లిదండ్రులు సైతం బాధపడతారన్నారు. తల్లిదండ్రులను బాధపెట్టకుండా క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత చదువులు చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి సమాజంలో తల్లిదండ్రులు గౌరవంతో బతికేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాదకద్రవ్యాలు ముట్టబోమని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్‌జాదవ్, పాఠశాల టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజన టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

ఉట్నూర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాల్సిందిగా ఐటీడీఏ పీవో యువరాజ్ మర్మాట్‌కు వినతిపత్రం అందజేశామని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆత్రం భుజంగరావు తెలిపారు. మంగళవారం పీఓ క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి సమస్యల వినతిపత్రం అందజేశామన్నారు. గిరిజన సంక్షేమ శాఖలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న విద్యా సమస్యలను పరిష్కరించి, విద్యా వ్యవస్థ అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశామన్నారు. సంగం తరఫున మాస పత్రిక, జీవోబుక్, అలాగే సమస్యల కరపత్రాన్ని పీఓకి అందజేశామన్నారు. కార్యక్రమంలో కొమురంభీం జిల్లా ప్రధాన కార్యదర్శి కనకవెంకటేశ్వరరావు, ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్సుకోల జ్ఞానేశ్వర్, మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి భుక్యమనోజ్‌కుమార్, ఉపాధ్యాయ నాయకులు రాష్ట్రకౌన్సిలర్ శ్యామ్‌రావ్, సాగర్, రమేశ్వర్, లక్ష్మణ్,నానేశ్వర్, రాజేందర్, దత్తు, కృష్ణ, సంతోష్, గణేష్, వినాయక్ తదితరులు పాల్గొన్నారు.